


కదల్లేని స్థితిలో ఉన్న ఏనుగు


కుంకీల సాయంతో రెస్క్యూ ఆపరేషన్ నిర్వహిస్తున్న అటవీశాఖ సిబ్బంది


పొక్లెయిన్ సాయంతో ఏనుగును బయటకు తీస్తున్న అధికారులు


ఏనుగును చూడటానికి వచ్చిన జనం

ఆపరేషన్ గజ

కాలు విరిగి చెరువులో ఇరుక్కుపోయిన ఏనుగు


కాపాడే ప్రయత్నంలో అటవీశాఖ

యాదమరి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాలు విరిగి చెరువులో కదల్లేని స్థితిలో ఉండిపోయిన ఒక ఏనుగును కాపాడేందుకు అటవీశాఖ ప్రయత్నిస్తోంది. వారం కిందట తమిళనాడు రాష్ట్రం నుంచి యాదమరి మండలంలోని కమ్మపల్లె అటవీ బీట్‌లోకి ఒంటరి ఏనుగు ప్రవేశించింది. అడవిలో జారిపడటంతో ఏనుగు కుడికాలు తొడభాగంలో ఎముక విరిగింది. అయినా కష్టంమీద తిరుగాడిన ఏనుగు శనివారం రాత్రి యాదమరి మండలం డీకే చెరువు సమీపంలోని గుడ్డివాని చెరువులోకి దిగింది. ఆ తర్వాత కదల్లేక నీటిలోనే ఉండిపోయింది. ఆదివారం స్థానికులు గమనించి అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. జిల్లా అటవీశాఖ అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో సిబ్బంది వచ్చి పరిశీలించి ఏనుగును కాపాడేందుకు చర్యలు మొదలుపెట్టారు. పలమనేరు ముసలిమడుగు నుంచి కృష్ణ, అభిమన్యు అనే కుంకీ ఏనుగులను, మావటీలను రప్పించి మధ్యాహ్నం నుంచి కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. ఎస్వీ జూపార్కు వైద్యులు డాక్టర్ అరుణ్, డాక్టర్ తోయిబా సింగ్ పర్యవేక్షణలో ముందుగా ఏనుగుకు నొప్పి నివారణ మందులు ఇస్తామని అటవీ అధికారులు తెలిపారు. అనంతరం మత్తు ఇంజక్షన్ ఇచ్చి పొక్లెయిన్ సాయంతో లారీలోకి ఎక్కించి తిరుపతి ఎస్వీ జూ పార్కుకు తరలించనున్నామని అనంతపురం సర్కిల్ సీసీఎఫ్ యశోదాబాయి తెలిపారు. కాగా, ఏనుగును చూసేందుకు సమీప గ్రామాలకు చెందిన ప్రజలు భారీగా తరలివచ్చారు. అటవీ సిబ్బందికి ఇబ్బంది తలెత్తకుండా ఎస్‌ఐ ఈశ్వర్ చర్యలు తీసుకున్నారు. ఆదివారం రాత్రి పది గంటలైనా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. అటు తమిళనాడు అటవీశాఖ అధికారులు కూడా ఈ ప్రక్రియను పరిశీలిస్తున్నారు. మరోవైపు మండల సరిహద్దుల్లో బోడబండ్ల బీట్‌లో 13 ఏనుగుల గుంపు తిష్ట వేసి ఉన్నట్లు సమాచారం. దీంతో అటవీ సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎఫ్‌వో శ్రీనివాసులు హెచ్చరించారు.

జిల్లాకు రెడ్ అలర్ట్

దిత్వా తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురవనున్న నేపథ్యంలో జిల్లాకు రెడ్ అలర్ట్ ప్రకటించారు. తుఫాన్ ప్రస్తుతం కారైక్కల్‌కి 100కి.మీ, పుదుచ్చేరికి 110కి.మీ, చెన్నైకి 180కి.మీ దూరంలో కేంద్రీకృతమైంది. గడిచిన ఆరు గంటల్లో గంటకు 12 కిలోమీటర్ల వేగంతో కదులుతూ మరో 24 గంటలపాటు ఉత్తర తమిళనాడు-పుదుచ్చేరి తీరాలకు సమాంతరంగా తుఫాన్ కదిలే అవకాశం ఉన్నట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు.

- చిత్తూరు సెంట్రల్, ఆంధ్రజ్యోతి



● 'దిత్వా' ఎఫెక్ట్

రానున్న 24 గంటల్లో వర్షపాతమిలా..

నింద్రలో అత్యధికంగా 25.84 మి.మీ వర్షపాతం నమోదు కానుంది. నగరిలో 22.73, కార్వేటినగరంలో 19.22, విజయపురంలో 12.34, వెదురుకుప్పంలో 9.22, రొంపిచెర్లలో 8.88, పులిచెర్లలో 5.56, శాంతిపురంలో 3.85, సదుంలో 3.49, చౌడేపల్లెలో 3.13 మి.మీ వర్షపాతం నమోదు కానుండగా, మిగిలిన మండలాల్లో అంతకన్నా తక్కువ వర్షం కురుస్తుందని వాతావరణ శాఖ అంచనా వేసింది.

రానున్న ఐదు రోజుల్లో వాతావరణం ఇలా..

జిల్లాలో రానున్న ఐదు రోజుల పాటు వాతావరణం ఎలా ఉండనుందో వాతావరణ శాఖ తెలిపింది. బంగారుపాళ్యం, చిత్తూరు, జీడీ నెల్లూరు, ఐరాల, కార్వేటినగరం, నగరి, నింద్ర, పెనుమూరు, పూతలపట్టు, శాంతిపురం, తవణంపల్లె, వెదురుకుప్పం, విజయపురం, యాదమరి మండలాల్లో 64.6 నుంచి 115.7 మి.మీ వర్షపాతం నమోదు కానుంది. బైరెడ్డిపల్లె, చౌడేపల్లె, గంగవరం, గుడుపల్లె, గుడిపాల, కుప్పం, పలమనేరు, పాలసముద్రం, పెద్దపంజాణి, పులిచెర్ల, పుంగనూరు, రామకుప్పం, రొంపిచెర్ల, శాంతిపురం, సదుం, సోమల, వి.కోట మండలాల్లో 15.7 నుంచి 64.6 మి.మీ వర్షం నమోదు కానుంది.

జిల్లా అంతటా వర్షం

దిత్వా తుఫాను కారణంగా ఆదివారం జిల్లా అంతటా వర్షం కురిసింది. ఉదయం 8.30 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. సోమల మండలంలో అత్యధికంగా 18.8 మి.మీ వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా.. రొంపిచెర్లలో 14.8, పులిచెర్లలో 14.2, విజయపురంలో 12.2, సదుంలో 11.8, వెదురుకుప్పంలో 9.2, వి.కోటలో 8.2, పెనుమూరులో 8, ఎస్ఆర్‌పురంలో 7.6, కార్వేటినగరంలో 7.2, నింద్రలో 6.8, పుంగనూరు, బైరెడ్డిపల్లెలో 5.4, పూతలపట్టులో 5.2, రామకుప్పంలో 4.8, గుడుపల్లెలో 4.6, పెద్దపంజాణిలో 4.4, ఐరాల, గంగవరం, శాంతిపురంలో 4.2, చౌడేపల్లెలో 4, నగరి, జీడీనెల్లూరు, పలమనేరులో 3.8, కుప్పంలో 3.6, తవణంపల్లె, బంగారుపాళ్యం, యాదమరి, చిత్తూరు అర్బన్‌లో 3.4, చిత్తూరు రూరల్‌లో 2.6, గుడిపాలలో 2.4 మి.మీ వర్షపాతం నమోదైంది.


ఐరాలలో కురుస్తున్న వాన

అధికారులు, సిబ్బంది ప్రధాన కేంద్రాల్లో ఉండాలి

● కలెక్టర్ సుమిత్ కుమార్



చిత్తూరు సెంట్రల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుపాను వాయుగుండంగా మారడంతో జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, అధికారులతో పాటు గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలోని సిబ్బంది ప్రధాన కేంద్రాల్లోనే ఉండాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. దిత్వా తుపాను నేపథ్యంలో ఆదివారం అధికార యంత్రాంగంతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, ముందస్తు ఏర్పాట్లపై సమీక్షించి దిశానిర్దేశం చేశారు. ఆదివారం రాత్రి, సోమవారం జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందన్నారు. ఎంపీడీవోలు, తహసీల్దార్లు, గ్రామ సచివాలయాల సిబ్బంది ప్రధాన కేంద్రాల్లో ఉండాలన్నారు. జిల్లాలోని 14 మండలాల్లోని 168 గ్రామాల్లో దిత్వా తుపాను ప్రభావం ఉండే అవకాశం ఉందని, సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూసుకోవాలని, లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేయాలన్నారు. ఎన్టీఆర్, కృష్ణాపురం జలాశయాల నుంచి నీటి విడుదలపై ఎస్ఈ, ఇంజనీర్లతో ఆరా తీశారు. జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో పీహెచ్‌సీల్లో 24/7 వైద్య సిబ్బంది ఉండేలా చూసుకోవాలన్నారు. పలమనేరు, పెద్దపంజాణి, బంగారుపాళ్యం, నింద్ర, కార్వేటినగరం మండలాల్లోని ప్రధాన చెరువుల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలిచ్చారు. తుపాను ప్రభావం తగ్గేవరకు వరి కోతలు ఆపించాలని, లేదంటే ధాన్యం తడిచిపోయే అవకాశం ఉందని రైతులకు తెలియజేయాలన్నారు. ఎస్పీ తుషార్ మాట్లాడుతూ.. డీఎస్పీల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు సైతం అప్రమత్తంగా ఉండాలన్నారు.

కలెక్టరేట్‌లో నేడు 'పీజీఆర్ఎస్'

చిత్తూరు అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. పీజీఆర్ఎస్ హాలులో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తామని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే డివిజన్, మండల స్థాయిల్లోనూ పీజీఆర్ఎస్ నిర్వహించాలని ఆదేశాలిచ్చారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో..

● జిల్లా పోలీసు కార్యాలయంలోనూ సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పీజీఆర్ఎస్ జరుగుతుందని ఎస్పీ తుషార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాధితులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.







ఒంటరి ఏనుగు విరిచేసిన కొబ్బరి, మామిడిచెట్లు - ఎర్రచందనం చెట్టును కూకటివేళ్లతో పెకలించిన ఏనుగు

ఒంటరి ఏనుగు బీభత్సం

● కమ్మపల్లె పంచాయతీలోని పంటలపై దాడి ● చెట్లను విరిచేసి.. ఓ కోళ్లఫారాన్నీ ధ్వంసం చేసింది

కల్లూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలోని పంటలపై ఒంటరి ఏనుగు దాడులు ఆగడంలేదు. కమ్మపల్లె పంచాయతీలో శనివారం రాత్రి బీభత్సం సృష్టించింది. తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని సూరప్పచెరువు నుంచి బయల్దేరిన ఒంటరి ఏనుగు బాలిరెడ్డిగారిపల్లె వద్దకు చేరుకుంది. నరసింహారెడ్డి, నారాయణరెడ్డి, మోహన్‌రెడ్డి, మనోజ్‌కుమార్‌రెడ్డి, రామిరెడ్డి, నారాయణరెడ్డికి చెందిన కొబ్బరి, మామిడిచెట్లను విరిచేసింది. ముల్లంగి, బెండ, అలసంద పంటలను నాశనం చేసింది. దేశిరెడ్డిగారిపల్లెలోని గరుడారెడ్డి, తిమ్మారెడ్డికి చెందిన టేకు, ఎర్రచందనం చెట్లను కూకటివేళ్లతో పెకలించింది. ఇదే గ్రామంలోని శిద్దారెడ్డి, రవీంద్రారెడ్డి, కేశవులురెడ్డికి చెందిన మామిడి, కొబ్బరిచెట్లను విరిచేసి, పశుగ్రాసాన్ని తినేసింది. అక్కడినుంచి కమ్మపల్లె వద్దకు చేరుకుంది. గ్రామానికి సమీపంలో ఉన్న విశ్వనాథనాయుడికి చెందిన కోళ్లఫారాన్ని ధ్వంసం చేసింది. పక్కనున్న సుధాకర్‌నాయుడు, శిద్దయ్యనాయుడికి చెందిన కొబ్బరి, మామిడిచెట్లను విరిచేసి, పశుగ్రాసాన్ని తినేసింది. ఈ క్రమంలో ఒంటరి ఏనుగు చేసిన ఘీంకారంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. అక్కడినుంచి వచ్చిన మార్గంలోనే అడవిలోకి వెళుతూ పలువురు రైతులకు చెందిన మామిడిచెట్ల కొమ్మలను విరిచేసింది. ఆదివారం పగలంతా సూరప్పచెరువు వద్ద ఒంటరి ఏనుగు సంచరించినట్లు అటవీ సిబ్బంది తెలిపారు. ధ్వంసమైన పంటలను వారు పరిశీలించి.. నష్టపరిహారం మంజూరుకు వివరాలు అందజేయాలని రైతులకు సూచించారు.

నణియాలకు చేరుకున్న **జయంత్, వినాయక్** 7

నిరాశ నిన్నటి మాట.. ధైర్యం నేటి బాట
● తగ్గుతున్న హెచ్ఐవీ కేసులు
● నేడు వరల్డ్ ఎయిడ్స్ డే





బోయకొండలో ఆన్‌లైన్ సేవలు

● గంగమ్మ దర్శనం, వసతి తదితర సౌకర్యాలు పొందవచ్చు: ఈవో

చౌడేపల్లె, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ భక్తుల సౌకర్యం కోసం అమ్మవారి సేవలు ఆన్‌లైన్ ద్వారా కూడా పొందవచ్చునని ఈవో ఏకాంబరం పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం భక్తులకు మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో ఇక నుంచి డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీ టీఈఎంపీఎల్ఈఎస్. ఓఆర్‌జీ వెబ్‌సైట్, లేక 95523 00009 ద్వారా మన మిత్ర వాట్సాప్ ద్వారా అమ్మవారి సేవలు, ప్రసాదాలు, దర్శనం, వసతి తదితర సౌకర్యాలు పొందవచ్చని పేర్కొన్నారు. ఈ సదుపాయాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాగా, ఆదివారం గంగమ్మ ఆలయం భక్తులతో కిక్కిరిసింది. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఆలయ ఈవో ఏకాంబరం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నీటిసంపులో పడి బాలిక మృతి


ప్రణతి మృతదేహం

పుంగనూరు రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నీటి సంపులో పడి ఓ బాలిక (6) మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పుంగనూరు మండలం మోదుగులపల్లెకు చెందిన అమరనాథ్ కుమార్తె ప్రణతి(6) ఆడుకుంటూ ప్రమాదవశాత్తూ ఇంటి వద్ద ఏర్పాటు చేసిన నీటి సంపులో పడిపోయింది. చిన్నారి కనిపించక పోవడంతో కుటుంబీకులు ఇంటి చుట్టుపక్కల వెతికారు. ఆచూకీ తెలియక పోవడంతో అనుమానంతో నీటి సంపులో పరిశీలించగా అందులో బాలిక కనిపించింది. చిన్నారిని వెంటనే వెలుపలకు తీసి పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ సంఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

6న జడ్పీ సర్వసభ్య సమావేశం

చిత్తూరు రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ (జడ్పీ) సర్వసభ్య సమావేశం ఈ నెల 6వ తేదీన నిర్వహించనున్నట్లు సీఈవో రవికుమార్ నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి కలెక్టర్, ప్రజాప్రతినిధులు, సభ్యులు హాజరవుతారని జిల్లా స్థాయి అధికారులందరూ తప్పక హాజరు కావాలని సూచించారు.

పేలుడు పదార్థాల స్వాధీనం: ముగ్గురి అరెస్టు

బంగారుపాళ్యం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): క్వారీ పనుల కోసం వాడే పేలుడు పదార్థాలను దాచి ఉంచిన ముగ్గురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. మొగిలిఘాట్‌లోని ఏకాంబరం నాయుడు ఇంటి వెనుక ఎక్స్‌ప్రెస్ హైవే సమీపంలో పేలుడు పదార్థాలు ఉన్నాయని సమాచారం అందడంతో ఆదివారం దాడులు చేశామన్నారు. బంగారుపాళ్యం మండలం గౌరీశంకరపురంకు చెందిన మొగిలప్పనాయుడి కుమారుడు ఆనంద నాయుడు, వెదురుకుప్పం మండలం తెల్లగుండ్లపల్లె గ్రామానికి చెందిన బుచ్చయ్య కుమారుడు నాగరాజు, యాదమరి మండలం ఓటివారిపల్లె గ్రామానికి చెందిన వెంకటాద్రిరెడ్డి కుమారుడు ధనంజయరెడ్డి పట్టుబడ్డారన్నారు. వారి వద్ద నుంచి 100 డిటోనేటర్లు, 200 జిలెటిన్ స్టిక్స్, 50 కిలోల సల్ఫర్ సాల్ట్‌ను స్వాధీనం చేసుకున్నామని వివరించారు. వీరిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ ప్రసాద్, వీఆర్వోలు హేమచంద్ర, నవీన్ పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న పేలుడు పదార్థాలతోపాటు నిందితులను చూపుతున్న పోలీసులు, వీఆర్వోలు

ఏపీ సర్వేయర్ల జిల్లా నూతన కార్యవర్గం



చిత్తూరు అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ (ఏపీ) సర్వే అధికారుల సంఘం జిల్లా కార్యవర్గ ఎన్నికలు ఆదివారం స్థానిక ఏపీ ఎన్జీవో భవనంలో జరగాయి. ఎన్నికల అధికారులుగా కరుణకుమార్, చరణ్ వ్యవహరించారు. ఉపాధ్యక్ష, కార్యదర్శి మినహా మిగిలిన పదవులకు ఒక్కో నామినేషన్ వంతున దాఖలు కావడంతో ఏకగ్రీవమయ్యాయి. మధ్యాహ్నం మూడు గంటలకు జిల్లా కార్యదర్శి, ఉపాధ్యక్ష పదవులకు ఎన్నికలు నిర్వహించి, విజేతలను ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా కిరణ్‌కుమార్(ఎంఎల్ ఎస్వో, టీఎఫ్), కార్యదర్శిగా సి.లోకనాథం(బైరెడ్డిపల్లె), ఉపాధ్యక్షుడిగా యోగేష్(చిత్తూరు రూరల్), సంయుక్త కార్యదర్శిగా కృష్ణమూర్తి(పలమనేరు), కోశాధికారిగా రామాంజనేయులు(పెద్ద పంజాణి), కార్యవర్గ సభ్యులుగా ఉమాశంకరయ్య(చిత్తూరు రూరల్), గోపినాథ్(గుడిపాల), సమీర(చిత్తూరు), చిన్నికృష్ణ(రామకుప్పం), సురేంద్రనాయక్(చౌడేపల్లె), భాస్కర్(రామకుప్పం)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

క్వార్టర్ ఫైనల్స్‌కు బాస్కెట్ బాల్ పోటీలు



చిత్తూరు జట్టుతో నిర్వాహకులు

పలమనేరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో జరుగుతున్న అండర్-14 బాస్కెట్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. ఆదివారం పోటీల్లో భాగంగా బాలుర విభాగంలో శ్రీకాకుళం, విజయనగరం జట్లు తలపడ్డాయి. విజయనగరం జట్టు గెలుపొందింది. పశ్చిమ గోదావరి జిల్లాతో జరిగిన పోటీలో తూర్పు గోదావరి జట్టు విజయం సాధించింది. ప్రకాశం జిల్లా జట్టుతో తలపడి చిత్తూరు జట్టు జయకేతనం ఎగురవేసింది. బాలికల విభాగంలో చిత్తూరు, అనంతపురం జట్లు, తూర్పుగోదావరి, శ్రీకాకుళం జట్లు, గుంటూరు, విజయనగరం జట్లు, కడప, విశాఖ జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాయని నిర్వాహకులు తెలిపారు. సోమవారం సెమీ ఫైనల్స్, ఫైనల్స్ పోటీలు జరుగుతాయన్నారు.

తండ్రిపై కొడుకు దాడి



స్పృహ తప్పిన చెంగారెడ్డి

శ్రీరంగరాజపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తండ్రిపై కొడుకు దాడి చేసిన సంఘటన ఆదివారం రాత్రి ఎస్ఆర్‌పురం మండలంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఎస్ఆర్‌పురం మండలం పిళ్లారికుప్పం గ్రామానికి చెందిన చెంగారెడ్డి కుమారుడు కమలేష్ జల్సాలకు అలవాటు పడి మద్యానికి బానిసై రోజూ తండ్రితో, బంధువులతో గొడవపడేవాడు. గతంలో ఆస్తి విషయమై గొడవ రావడంతో, పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించి.. తండ్రీకొడుకులు పంచుకున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి తండ్రిని డబ్బులు అడగడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో గ్రామస్తులు చూస్తుండగానే తండ్రిపై కమలేష్ విచక్షణారహితంగా దాడి చేయడంతో స్పృహ తప్పి పడిపోయాడు. స్థానికులు వెంటనే ఆయన్ను 108లో చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం ఇచ్చారు.

'ఎన్టీఆర్ భరోసా' పింఛన్లకు రూ.114.8 కోట్ల విడుదల

చిత్తూరు సెంట్రల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా 2,68,066 మందికి పంపిణీ చేసే 27 రకాలైన పింఛన్లకు సంబంధించి రూ.114.80 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. పింఛన్లను సోమవారం ఉదయం ఏడు గంటల నుంచి లబ్ధిదారులకు డీఆర్‌డీఏ ద్వారా గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది పంపిణీ చేయనున్నారు.

డిస్కం ఉద్యోగులూ.. సిద్ధంగా ఉండండి

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): 'దిత్వా తుఫాన్ ప్రభావంతో వీచే గాలులకు విద్యుత్ వైర్లు తెగొచ్చు. స్తంభాలు కూలిపోవచ్చు. తద్వారా సరఫరాలో అంతరాయం కలగొచ్చు. వెంటనే వీటన్నింటినీ సరిచేసి సరఫరా పునరుద్ధరించడానికి సిద్ధంగా ఉండండి' అంటూ సదరన్ డిస్కం సీఎండీ శివశంకర్ అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా ఇబ్బంది తలెత్తితే టోల్ ఫ్రీ నెంబరు 1912, లేదా 1800 425 155333కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలని వినియోగదారులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

ఐఐటీలో భారత్ లీన్ కన్‌స్ట్రక్షన్ కాన్ఫరెన్స్

ఏర్పేడు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగాలపల్లె సమీపంలో ఉన్న తిరుపతి ఐఐటీలో భారత్ లీన్ కన్‌స్ట్రక్షన్ ఎక్సలెన్సీ ఇనిస్టిట్యూట్(ఐఎల్‌సీఈ) ఆధ్వర్యంలో నిర్వహించే 8వ ఇండియన్ లీన్ కన్‌స్ట్రక్షన్ కాన్ఫరెన్స్ ఆదివారం ప్రారంభమైంది. ఈనెల 3వ తేదీ వరకు జరిగే ఈ సదస్సు వర్క్‌షాప్‌తో ప్రారంభమైంది. అకడమిక్ పాట్రన్‌గా ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ వ్యవహరిస్తుండగా ఇండస్ట్రీ ప్యాట్రన్‌గా గోద్రెజ్ కన్‌స్ట్రక్షన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అనూప్ మాథ్యూ హాజరవుతున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న నిర్మాణ పరిశ్రమ నిపుణులు, పరిశోధకులు, విద్యావేత్తలు, కన్సల్టెంట్లు, ఇండస్ట్రీ భాగస్వాములు పాల్గొంటున్నారు. సస్టైనబుల్, డిజిటల్ కన్‌స్ట్రక్షన్ ప్రాజెక్టు డెలివరీపై అభిప్రాయాలను పంచుకోనున్నారు. సోమవారం ఇండస్ట్రీ డే నిర్వహించనున్నారు. 2, 3 తేదీల్లో ప్రధాన కాన్ఫరెన్స్ జరుగుతుంది.

నేడు మంత్రి నారాయణ రాక

రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ సోమవారం ఈ సదస్సుకు హాజరుకానున్నారు. సోమ, మంగళవారాల్లో జరిగే 8వ కాన్ఫరెన్స్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించనున్నారు.

నిరాశ నిన్నటి మాట.. ధైర్యం నేటి బాట

- తగ్గుతున్న హెచ్ఐవీ కేసులు
- నేడు వరల్డ్ ఎయిడ్స్ డే

చిత్తూరు రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు హెచ్ఐవీ పాజిటివ్ వస్తే జీవితాన్ని కోల్పోయినట్లు భావించేవారు. ఎలాంటి చికిత్స లేదనుకునేవారు. పాటిజివ్ అని నివేదికలో తేలితే ఆత్మన్యూనతతో వెనుకంజ వేసేవారు. కనీసం వైద్యులను కూడా సంప్రదించకుండా మృత్యువు అంచుకు చేరేవారు. కానీ ఈ పరిస్థితుల్లో చాలా మార్పు వచ్చింది. చికిత్స పొందడానికి ధైర్యంగా ముందుకు వస్తున్నారు. ప్రభుత్వం కూడా ఈ వ్యాధికి సంబంధించి విస్తృత ప్రచారం చేస్తోంది. అవగాహన కల్పిస్తోంది. ఫలితంగా జిల్లాలో హెచ్ఐవీ కేసులు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి.

బాధితులకు బాసటగా...

జిల్లాలో 4169 మంది హెచ్ఐవీ, ఎయిడ్స్ బాధితులు ఉన్నారు. వీరికి వైసీపీ ప్రభుత్వ హయాంలో పింఛను సక్రమంగా అందేది కాదు. కూటమి ప్రభుత్వం రాగానే బాధితులకు భరోసా లభించింది. వీరికి రూ.4వేల వంతున పింఛను ఇవ్వాలని ఆదేశించింది. ఈక్రమంలో ప్రస్తుతం సుమారు 750 మందికి పింఛన్లు అందుతున్నాయి. బాధితుల్లో కొందరు దివ్యాంగ, వితంతు, వృద్ధాప్య పింఛన్లు పొందుతున్నట్లు గుర్తించామని వైద్య వర్గాలు చెబుతున్నాయి. కొందరు పింఛను కోసం దరఖాస్తు చేయడం లేదని తెలుస్తోంది. కాగా ఈ ఏడాది ఇప్పటి వరకు 18 మంది గర్భిణులు హెచ్ఐవీ బారిన పడ్డారని వైద్యపరీక్షల్లో తేలింది.

బస్సు పాసులను పునరుద్ధరించాలి

హెచ్ఐవీ బాధితులకు ఏఆర్‌టీ కేంద్రాల ద్వారా నెలలో రెండుసార్లు మందులను ఇస్తుంటారు. దూర ప్రాంతాల నుంచి రావడానికి కొంత ఇబ్బంది పడుతున్నామని కొందరు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలోని ఏఆర్‌టీ కేంద్రం

గతంలో టీడీపీ ప్రభుత్వ హయంలో ఆర్టీసీ బస్సు పాసులను ఉచితంగా అందజేసింది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఈ పాసులను నిలిపేసింది. కూటమి ప్రభుత్వం రావడంతో బస్సు పాసులను పునరుద్ధరించాలని బాధితులు కోరుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా ఆపరేషన్లు చేయకుండా ప్రైవేటు ఆస్పత్రులకు రెఫర్ చేసేస్తున్నారని కొందరు వాపోతున్నారు.

హెచ్ఐవీ ఎలా వస్తుందంటే?

సురక్షితం కాని లైంగిక సంబంధాల కారణంగా, పరీక్ష చేయని రక్త మార్పిడి వల్ల హెచ్ఐవీ సోకుతుంది. హెచ్ఐవీ ఉన్న తల్లి నుంచి బిడ్డకు, వాడేసిన సూదులు, సిరంజిలను మరోసారి వాడడం వల్ల కూడా సోకుతుంది. హెచ్ఐవీ బాధితులతో కలిసి తిరిగినా, కలిసి భోజనం చేసినా, దోమకాటు వల్ల రాదు. బాధితులు వాడిన పనిముట్లు ఉపయోగించినా, కరచాలనం చేసినా రాదని గుర్తించాలి.

అవగాహన పెరిగింది

హెచ్ఐవీ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ప్రచారం చేస్తోంది. దీనివల్ల ఎయిడ్స్‌పై అవగాహన పెరిగింది. గతంతో పోల్చితే కేసులు గణనీయంగా తగ్గాయి. హెచ్ఐవీ సోకిన వారు ఏఆర్‌టీ కేంద్రాలకు వచ్చి మందులు తీసుకుని జీవిత కాలాన్ని పెంచుకుంటున్నారు.



- డాక్టర్ వెంకట ప్రసాద్, జిల్లా టీబీ, హెచ్ఐవీ, ఎయిడ్స్ నిర్మూలన అధికారి

నేడు చిత్తూరులో అవగాహన ర్యాలీ

వరల్డ్ ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా సోమవారం చిత్తూరులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ టీబీ నివారణ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 గంటలకు చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి నుంచి గాంధీ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లి మానవహారం నిర్వహిస్తామన్నారు. ముఖ్యఅతిథిగా చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పాల్గొంటారని పేర్కొన్నారు.

ననియాలకు చేరుకున్న జయంత్, వినాయక్

రామకుప్పం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కుంకీలు (శిక్షణ పొందిన ఏనుగులు) జయంత్, వినాయక్‌లు సుదీర్ఘ కాలం తర్వాత రామకుప్పం ననియాలలోని కౌండిన్య ఎలిఫెంటు క్యాంపునకు చేరుకున్నాయి. మన్యం, రాయలసీమ జిల్లాల్లో ఏనుగుల దాడులను నిరోధించడానికి మార్చి నెలలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో అటవీశాఖ కర్ణాటక నుంచి కృష్ణ, అభిమన్యు, దేవా, రంజన్ అనే నాలుగు కుంకీలను పలమనేరు సమీపంలోని ముసలిమడుగు క్యాంపునకు తీసుకొచ్చింది. ఆ కుంకీలు ఇక్కడి పరిసరాలకు అలవాటుపడేలా వాటికి శిక్షణ ఇవ్వడానికి ననియాల కౌండిన్య ఎలిఫెంట్ క్యాంపులోని కుంకీలు జయంత్, వినాయక్‌లను ముసలిమడుగుకు తరలించారు. వీటిసాయంతో నాలుగు కుంకీలకు శిక్షణ ఇప్పించారు. మరోవైపు పది రోజుల కిందట కుప్పం అటవీ ప్రాంతంలోకి వచ్చిన ఏనుగులు ఓ రైతుపై దాడి చేసి చంపేశాయి. ఇంకోవైపు ఓ ఒంటరి ఏనుగు, రెండు ఏనుగుల మందలు పంటలపై దాడులు కొనసాగించాయి. వీటిని నిలువరించడానికి అటవీశాఖ అధికారులు ముసలిమడుగు క్యాంపులోని జయంత్, వినాయక్‌లను కుప్పం సమీపంలోని నాయనూరు క్యాంపునకు తీసుకొచ్చారు. వీటి సాయంతో దాడులు చేస్తున్న ఏనుగుల మందలు కుప్పం అడవులను వదిలి తమిళనాడు అడవులకు వెళ్లిపోయేలా చేశారు. పనులన్నీ పూర్తవడంతో జయంత్, వినాయక్‌లను శనివారం సాయంత్రం ననియాల కౌండిన్య ఎలిఫెంట్ క్యాంపునకు తీసుకొచ్చారు.

మదంతో కుంకీలు

అక్టోబరు నుంచి జనవరి నెల వరకు మగ ఏనుగులు మదంతో ఉంటాయి. ఈ కాలవ్యవధిలో అవి ఆడ ఏనుగుల సాంగత్యం కోసం మత్తులో ఉంటాయి. అంతేకాకుండా వాటి ప్రవర్తన ప్రమాదకరంగా ఉంటుంది. ప్రస్తుతం జయంత్, వినాయక్‌ల పరిస్థితి కూడా అలాగే ఉంది. ననియాలకు తరలించడానికి వాహనాల్లో ఎక్కిస్తున్న సందర్భంగా ఇవి రెండూ బాహాబాహీ తలపడేందుకు యత్నించినట్టు సమాచారం. వీటిని నలుగురు మావటీలు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో జయంత్, వినాయక్‌లను చూడటానికి ననియాల ఎకో టూరిజం ప్రాజెక్టుకు వచ్చే సందర్శకులను అనుమతించడం లేదు.





జయంత్ - వినాయక్

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా జీఎం రాజు

చిత్తూరు సెంట్రల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా కుప్పం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జీఎం రాజు ఎన్నికయ్యారు. ఆదివారం చిత్తూరులోని మార్కెటింగ్ శాఖ ఏడీ కార్యాలయంలో జిల్లాలోని మార్కెట్ కమిటీ చైర్మన్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వైస్ చైర్మన్లుగా రాజన్న (పలమనేరు), శ్రీనివాసులు (సోమల), ప్రధాన కార్యదర్శిగా శమీపతి (పుంగనూరు), కార్యవర్గ సభ్యులుగా ఝాన్సీ వెంకటేష్ యాదవ్ (చిత్తూరు), భాస్కర్ నాయుడు (బంగారుపాళ్యం), కృష్ణమనాయుడు (వేపంజేరి), రాజమ్మ (నగరి), ఎస్కే సుజాత (రొంపిచెర్ల), సుజాత గుండయ్య (ఎస్ఆర్ పురం మార్కెట్ కమిటీ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన జీఎం రాజు మాట్లాడుతూ.. ఐదేళ్ల వైసీపీ పాలనలో వ్యవసాయ మార్కెట్ వ్యవస్థను నీరుగార్చి, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేకుండా చేసి, అప్పుల ఊబిలోకి నెట్టేశారన్నారు. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడి సహకారంతో మార్కెట్ కమిటీల్లో దళారీ వ్యవస్థను నిర్మూలించి, కొత్త కమిటీ ద్వారా మార్కెట్‌లో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లభించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. రైతులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తూ, మార్కెట్ కమిటీల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.



జలకళలాడుతున్న తిరుమల డ్యామ్‌లు



పాపవినాశనం డ్యామ్

తిరుమల, నవంబరు30(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాను వానలతో తిరుమలలోని జలాశయాలు పొంగి పొర్లుతున్నాయి. అక్టోబరులో కురిసిన వర్షాలకే తిరుమలలోని పాపవినాశనం, గోగర్భం, ఆకాశగంగ, కుమారధార, పసుపుధార డ్యాములు 98 శాతం నిండిపోయాయి. పాపవినాశనం, గోగర్భం డ్యాముల గేట్లను కూడా అప్పుడు ఎత్తాల్సివచ్చింది. నిజానికి ఇప్పుడు భారీ వర్షాలు కురవకపోయినా, నవంబరు నెల ప్రారంభంలో కురిసిన వర్షాలకు శేషాచల అడవుల నుంచి ఊటనీరు భారీగా డ్యాముల్లోకి చేరుతూ వచ్చింది. నవంబరు24వ తేదీకే డ్యాములన్నీ నిండిపోయి, గోగర్భం, పాపవినాశనం డ్యాముల గేట్లు ఒక అంగుళం మేర తెరిచి దిగువకు వదులుతున్నారు. రెండురోజుల నుంచి కురుస్తున్న వానలతో డ్యాములు నిండుకుండల్లా కనిపిస్తున్నాయి. ముందుజాగ్రత్తగా ఆదివారం మధ్యాహ్నం గోగర్భం, పాపవినాశనం గేట్లు మరొక అంగుళం పైకెత్తారు. ప్రస్తుతం పాపవినాశనంలో 5,240 లక్షల గ్యాలన్లు, గోగర్భంలో 2,833 లక్షల గ్యాలన్లు, ఆకాశగంగలో 685 లక్షల గ్యాలన్లు, కుమారధారలో 4,258.98 లక్షల గ్యాలన్లు, పసుపుధార డ్యాములో 1,287.51 లక్షల గ్యాలన్ల నీరు ఉంది. దాదాపు తొమ్మిది నెలల పాటు తిరుమల నీటి అవసరాలు తీర్చేంత నీరు ప్రస్తుతం డ్యాముల్లో ఉంది.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో 'చిత్తూరు' హవా

- మొదటి స్థానంలో బాలికలు
- రెండో స్థానాన్ని కైవసం చేసుకున్న బాలురు

బంగారుపాళ్యం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఖోఖో అండర్-14 స్కూల్ గేమ్స్ విభాగంలో చిత్తూరు బాలికల జట్టు గెలుపొంది.. వరుసగా మూడుసార్లు గెలిచి హ్యాట్రిక్ సాధించింది. అదే విధంగా బాలుర విభాగంలో జరిగిన పోటీల్లో రెండో స్థానంలో నిలిచింది. ఈ నెల 28, 29 తేదీల్లో విశాఖపట్నం జిల్లా అనకాపల్లిలో జరిగిన స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో చిత్తూరు జిల్లా బాల, బాలికలు జట్లు పాల్గొనగా, చిత్తూరు బాలికల జట్టు విశాఖపట్నంపై గెలిచి ప్రథమస్థానంలో నిలిచి ట్రోఫీ, మెడల్స్‌ను సాధించింది. అదేవిధంగా బాలుర జట్టు విశాఖపట్నంపై పోరాడి రెండో స్థానం దక్కించుకుంది. ఈ పోటీలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి బాల, బాలికల జట్లు పాల్గొనగా, చిత్తూరు జిల్లా జట్టు ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ, ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నాయి. గెలుపొందిన జట్లను కోచ్‌లు దేవేంద్ర, మధు, రాజేష్, పీడీలు ముత్తు, సురేష్, డీవైఎడీవో బాలాజి, స్కూల్ గేమ్స్ కార్యదర్శి బాబు, శారదలు విద్యార్థులను అభినందించారు.



రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో గెలుపొందిన బాలికల జట్టు



ద్వితీయస్థానం సాధించిన బాలుర జట్టు

నాగేటిసాళ్లలో రచయితకు సత్కారం

పలమనేరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కథా, నవలారచయిత జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి కథ 'నాగేటిసాళ్లలో' సాహిత్య చరిత్రలో చిరకాలం నిలిచిపోతుందని సాహితీ విమర్శకులు డాక్టర్ కవిత పేర్కొన్నారు. ఆదివారం పలమనేరు కళామందిరంలో నాగేటిసాళ్ల కథపై సమీక్ష జరిగింది. మనిషి అస్తిత్వానికి సంబంధించి విలువైన అంశాలను ఈ కథలో రచయిత పొందుపరిచారని కవిత చెప్పారు. పలమనేరు రచయితల సంఘం గౌరవాధ్యక్షుడు ఆర్.మాధవ్ మాట్లాడుతూ కథలోని వస్తువు,శైలి శిల్పం కథనం అద్భుతంగా ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా జొన్నవిత్తులను సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ కథారచయిత టీఎస్ఏ కృష్ణమూర్తి, జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు యుగంధర్ బాబు, ఉపాధ్యాయ నాయకులు గంటామోహన్, తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్ష, కార్యదర్శులు పి.తులసినాథంనాయుడు,పుష్ప దంపతులు, దోర్నాదుల సిద్దార్థ, బ్రహ్మంస, ఆనందతీర్థరావు, శ్రీపురం సీతారామయ్య, బాలాజి, తదితరులు పాల్గొన్నారు.



జొన్నవిత్తుల శ్రీరామ చంద్రమూర్తిని సన్మానిస్తున్న తులసినాథం నాయుడు తదితరులు





వాన ముసురు అందాలు







దిత్వా తుఫాన్ ప్రభావం తిరుమల క్షేత్రంలో భక్తులను వణికిస్తోంది. ఎడతెరిపి లేకుండా వాన కురుస్తూనే ఉంది. ఎటు చూసినా గొడుగులు కనిపిస్తున్నాయి. అనేకమంది నెత్తి తడవకుండా గుడ్డలు కప్పుకుని తిరుగుతున్నారు. చలికి షెడ్ల కింద ముడుక్కుని ఉంటున్నారు. దీంతో దుకాణాలు వెలవెలపోతున్నాయి. మరోవైపున ఘాట్ రోడ్లు సహా తిరుమల అంతా పొగమంచు కప్పేసింది. మంచు మబ్బుతెరల వెనుక దృశ్యాలు మనకబారి కనిపిస్తూ సరికొత్త అందాలను పంచుతున్నాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

పలమనేరు
కుప్పం/పుంగనూరు

నడింపల్లెలో ఎన్ఎస్ఎస్ శిబిరం


పిచ్చి మొక్కలను తొలగిస్తున్న విద్యార్థులు

సోమల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నడింపల్లెలో జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శ్రమదాన కార్యక్రమాలు చేపట్టారు. ఆదివారం గ్రామంలోని ఇంటింట పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కరపత్రాలను అందజేశారు. ఎల్లమ్మదేవత ఆలయ పరిసరాలను పరిశుభ్రం చేశారు. బస్టాండ్ పరిసరాల్లో పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అమరేంద్రకుమార్, సర్పంచి కర్రి వెంకటరమణ, ఎన్ఎస్ఎస్ పీవో గౌతం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయంలో అన్నప్రసాద వితరణ

సోమల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆవులపల్లె వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఆలయాన్ని టీటీడీ అనుబంధంగా మార్చిన క్రమంలో దుబాయిలో స్థిరపడిన సాంబమూర్తి, సుజాత కుటుంబ సభ్యులు అన్నప్రసాద వితరణకు ఉభయదారులు వ్యవహరించారు. పెద్దఉప్పరపల్లె, ఆవులపల్లె, అన్నెమ్మగారిపల్లె, పేటూరు పంచాయతీలకు చెందిన భక్తులు అన్నప్రసాద వితరణకు అవకాశం కల్పించినట్లు టీటీడీ అధికారులు తెలిపారు. ఆలయంలో అర్చకులు గోపీస్వామి, బాలాజీలు ప్రత్యేకపూజలు జరిపి తీర్థప్రసాదాలు అందజేశారు.

వెయ్యి మొక్కలు నాటడమే లక్ష్యం


మొక్కలు నాటుతున్న సుభాష్ రాజా

కుప్పం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎస్.కొత్తపల్లె ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సుభాష్ రాజా విధుల నిర్వహణతోపాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో సైతం చురుగ్గా పాల్గొంటున్నారు. ఈక్రమంలో పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటుతున్నారు. వెయ్యి మొక్కలు నాటడమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. డాక్టర్ సుభాష్ రాజా ఆదివారం కూడా మున్సిపాలిటీ పరిధిలో మొక్కలు నాటారు. తోటి యువకులు జనసేన పార్టీ నాయకులు హరిబాబు, ప్రవీణ్, హరి, చంద్రు, గణేశ్ బృందంతో కలిసి సుభాష్ రాజా ఇప్పటికే వంద మొక్కలు నాటారు.

గుంతలమయంగా నంజంపేట రోడ్డు



సోమల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి నంజంపేట రోడ్డు మార్గం గుంతలమయంగా మారింది. ఇటీవల కూటమి ప్రభుత్వం రోడ్డు మరమ్మతులకు రూ. 9 లక్షలు కేటాయించి పనులు పూర్తి చేశారు. రెండు నెలలకే మళ్లీ గుంతలు ఏర్పడి ప్రయాణం గగనంగా మారుతుందని వాహనదారులు వాపోతున్నారు. ఇటీవల వర్షాలకు గుంతల్లో నీరు నిల్వ ఉండటంతో ప్రమాదాలకు గురవుతున్నారు. గుంతలను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రారంభోత్సవానికి నోచుకోని షాదీమహల్



సోమల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సోమల - కందూరు మార్గంలో నిర్మించిన షాదీమహల్ ఏడాది క్రితం పనులు పూర్తయినా ప్రారంభోత్సవానికి నోచుకోవడంలేదు. కమిటీ సహకారంతో నిర్మించిన షాదీమహల్ సామాన్యులకు అనుకూలంగా ఉండంటుందని మండల ముస్లింలు పేర్కొంటున్నారరు. ఇతర దూర ప్రాంతాలకు వెళ్లి వ్యయ ప్రయాసలు పడుతూ శుభ కార్యక్రమాలు చేయడంభారంగా మారుతుందంటున్నారు. అధికారులు స్పందించి ప్రారంభించాలని కోరుతున్నారు.

ఉర్దూ టీచర్ల భర్తీకి డీఎస్సీ నిర్వహించాలి


జేఏసీ సమావేశానికి హాజరైన నాయకులు

పలమనేరు, నవంబరు30 (ఆంధ్రజ్యోతి) : ఉర్దూ పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియామకానికి ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలని ఉర్దూ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పలమనేరుల ఉర్దూ ఉన్నత పాఠశాల ఆవరణలో వీరు సమావేశమయ్యారు. ఉర్దూ అంగన్‌వాడీకేంద్రాలు ఏర్పాటు చేయాలని, పాఠశాలల్లో ఉర్దూ అడ్మిషన్లు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని, ప్రత్యేక సీఆర్‌సీ ఏర్పాటుచేయాలని, సెక్షన్ పాఠశాలల్లో ఫస్టు ల్యాంగ్వేజి ఉర్దూ పోస్టులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో హెచ్ఎం సైక్ సబ్జుసాహెబ్, జేఏసీ అధ్యక్షుడు మహమ్మద్ ఆలీ, ఛైర్మెన్ ఆర్.ఎస్.రహ్మతుల్లా, కన్వీనర్ వీరబ్బాని, ఎస్..అరీఫుల్లా, సీ. కలందర్‌భాషా, యాసీన్‌షరీఫ్,మునాఫ్, ఆల్తా తదితరులు పాల్గొన్నారు.

ఇలా దారి ఉంటే రాకపోకలెలా?



రొంపిచెర్ల,నవంబరు30(ఆంధ్రజ్యోతి): బోడిపాటివారిపల్లె పంచాయతీ మేడసానివారిపల్లె ప్రజలు రహదారి లేక ఇబ్బంది పడుతున్నారు. గ్రామంలో సుమారు వంద కుటుంబాలు ఉంటున్నాయి. ఉన్న కొదిపాటి రహదారి కూడా ఇటీవల వర్షాలకు కోతకు గురైంది. గుంతల్లో నీటి నిల్వ చేరి బురదమయంగామారింది. ఆస్పత్రి, పాఠశాల, నిత్యావసర సరుకుల కొనుగోలుకు మండల కేంద్రం వెళ్లాల్సి ఉంటుంది.. మాజీ సర్పంచ్ రవికుమార్ నాయుడితో ఈ గ్రామ రోడ్డు దుస్థితి ప్రస్తావించగా నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లారామచంద్రారెడ్డి దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఆయనతో సంప్రదించి పరిష్కార చర్యలు తీసుకుంటామన్నారు.

మృతుడి భార్యకు రూ. 5లక్షలు అందజేత


ఆర్థిక సాయం అందజేసి మాట్లాడుతున్నశ్రీకాంత్

పుంగనూరు, నవంబరు30(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటుందని రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.శ్రీకాంత్ చెప్పారు. ఆదివారం స్థానిక కుమ్మరవీధిలో ఇటీవల తెలంగాణ రాష్ట్రం జడ్చర్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన టీడీపీ కార్యకర్త బీసీరాజా ఆర్సు భార్య శశికళకు టీడీపీ కార్యకర్తల సంక్షేమనిధి, ప్రమాదబీమా ద్వారా రూ.5లక్షలు చెక్‌ను ఆయన ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి లోకేశ్ ఆలోచనతో బీమా సౌకర్యం కలిగిందని గుర్తు చేశారు. మృతుని భార్యకు వితంతు పింఛను మంజూరుకు కృషి చేస్తామన్నారు.

ఎన్జీవో నేతగా ఆనందబాబు


నియామకపు పత్రాన్ని అందుకుంటున్న ఆనందబాబు

పలమనేరు, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): ఏపీఎన్జీఓ సంఘం పలమనేరు తాలూకా ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో వరుసగా 5వసారి ఆనందబాబు ఏకగ్రీవంగా ఎంపికయ్యారని ఎన్నికల అధికారి అలీఖాన్ ప్రకటించారునియామకపు పత్రాన్ని అందజేశారు.కార్యదర్శిగా జయమ్మ, అసోసియేట్ అధ్యక్షుడిగా మోహన్‌రాంప్రసాద్, ఉపాధ్యక్షులుగా ఎన్.సురేష్, ఎన్. ప్రభాకర్, ఆర్.రాజశేఖర్ ఎన్నికయ్యారు. మహిళా ఉపాధ్యక్షురాలిగా నాగేశ్వరమ్మ, కోశాధికారిగా శ్రీనివాసులు, సంయుక్త కార్యదర్శులుగా ఎస్.హరి, జలందర్‌నాయుడు, జ్ఞానేశ్వర్ ఎన్నికయ్యారు. కేవీరాఘవులు, రమేష్, లక్ష్మీపతియాదవ్ పాల్గొన్నారు.

లారీ ఢీకొని మోటరు సైక్లిస్ట్ మృతి


మృతి చెందిన అంజి

పలమనేరు, నవంబరు30 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు-పుంగనూరు రహదారిలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో అంజి అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ముత్తుకూరు నుంచి మోటరుసైకిల్‌పై వస్తున్న అంజిని ముత్తుకూరు క్రాస్ వద్ద లారీ ఢీకొంది. దీంతో అంజి తలకు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పెద్దపంజాణి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏడేళ్లుగా మూత్రశాలలకు తాళాలు



పలమనేరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి) : స్థానిక ఆర్టీసీ బస్టాండులో ఏడేళ్లక్రితం నిర్మించిన మూ త్రశాలల్ని నేటికీ ప్రారంభించలేదు. వేలాది రూపాయలు వెచ్చించి మహిళలకు మూడు, పురుషులకు రెండు చొప్పున మూత్రశాలలను నిర్మించారు. ఇప్పటికీ తాళాలు వేసి వుంచారు. ఆర్టీసీ బస్టాండు ఏర్పాటు చేసిన తొలినాళ్లలో మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మించినా బాగోలేదని ఏడేళ్ల క్రితం వీటిని నిర్మించారు. ఈ బస్టాండుకు రోజూ వేలాది మంది ప్రయాణికులు వివిధ ప్రాంతాలనుంచి వస్తుంటారు. గత్యంతరంలేక వీరు బహిరంగ ప్రదేశాల్లో మూత్ర విసర్జన చేస్తున్నారు. బహిరంగ మూత్ర విసర్జన నిషేధం. అయితే ఇక్కడ మాత్రం మూత్రవిసర్జన బహిరంగమే. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మూత్రశాలను వినియోగానికి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నేడు మెగా రక్తపరీక్ష శిబిరం

రామకుప్పం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): సంజీవని పథకం ద్వారా యూనివర్సల్ హెల్త్ స్క్రీనింగ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం రామకుప్పంలో ఉచిత మెగా రక్తపరీక్ష శిబిరం నిర్వహించనున్నారు. టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటరమణ, కామరాజనాయక్‌లు శనివారం ఈ విషయం తెలిపారు. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీ కళ్యామండపంలో ఉదయం 7గంటల నుంచి 11గంటల వరకు రక్తనమూనాలు సేకరిస్తారన్నారు. 47రకాల రక్తపరీక్ష ఫలితాలు ప్రజలకు అందిస్తారన్నారు. ఫలితాలు ఆధారంగా స్థానిక వైద్యులను సంప్రదించి, అవసరమైతే తగు చికిత్సలు చేయించుకోవాలని కోరారు. రక్తనమూనాలు ఇవ్వదలచిన వారు ఉదయం ఖాళీ కడుపుతో హాజరు కావాలని సూచించారు. టీడీపీ నేతలు, కార్యకర్తలు చొరవ తీసుకుని ప్రజలను చైతన్యవంతుల్ని చేయాలిన కోరారు.

సరిహద్దు పట్టణాలకు ఆర్టీసీ బస్సులు లేక అవస్థలు

రామకుప్పం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల మధ్య ఉన్న రామకుప్పం పట్టణం నుంచి సరిహద్దు పట్టణాలకు ఆర్టీసీ బస్సు సర్వీసులు లేన మండల ప్రజలు అసౌకర్యానిక గురవుతున్నారు. మండల పరిధిలోని ప్రజలు వాణిజ్య, వ్యాపార, కుటుంబపరంగా నిత్యం బెంగళూరు, కేజీఎఫ్, ముళబాగల్, తమిళనాడు రాష్ట్రం వాణియంబాడీ, కృష్ణగిరి పట్టణాలకు వెళ్తుంటారు. రామకుప్పం నుంచి నేరుగా బస్సు సర్వీసులు లేకపోవడంతో మార్గ మధ్యలో పలు బస్సులు మారుతూ ప్రయాణం సాగించాల్సి వస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రామకుప్పం నుంచి సరిహద్దు పట్టణాలకు బస్సు సర్వీసులు నడపాలని కోరుతున్నారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం


హేమంత్

పుంగనూరు రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఇంటర్ చదువుతున్న పుంగనూరు విద్యార్థి శుక్రవారం నుంచి కనిపించ లేదు. పోలీసుల కథనం ప్రకారం పుంగనూరు ఏవీరావు వీధికి చెందిన పసుపర్తి మల్లికార్జున కుమారుడు హేమంత్ విజయవాడ గోసలైట్స్ కాలేజీలో చదువుతూ హాస్టల్‌లో ఉంటున్నాడు. శుక్రవారం ఉదయం కాలేజీకి వెళుతున్నట్లు చెప్పిన హేమంత్ కాలేజీకి వెళ్లలేదు. తిరిగి హాస్టల్‌కు కూడా రాకపోవడంతో కాలేజీ యాజమాన్యం తల్లిదండ్రులకు సమాచారమిచ్చింది. వారు విజయవాడ, బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో విద్యార్థి తండ్రి మల్లికార్జున విజయవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు 96292 74124, 94413 30536, 63006 82202 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని విద్యార్థి తల్లిదండ్రులు కోరారు.

5 నుంచి 11 వరకు ప్రవచనాలు

చిత్తూరు కల్చరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక నగరపాలక నాగయ్య కళాక్షేత్రంలో డిసెంబరు 5 నుంచి 11వ తేది వరకు ప్రతి రోజు సాయంత్రం 6నుంచి 9 గంటల వరకు ప్రముఖులచే ఆధ్యాత్మిక ప్రవచనాల కార్యక్రమాన్ని చిత్తూరు నారాయణీ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు సంస్థ ఆర్గనైజర్ చిరంజీవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 5, 6, 7 తేదీల్లో ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు శ్రీకాళహస్తీశ్వరశతకం, 8,9,10,11 తేదీల్లో రాధా మనోహర్‌దాస్‌చే భజగోవిందంపై ప్రవచనాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

శుభోదయాన శుభ్రతకు అడుగులు

మార్నింగ్ వాక్‌లో కమిషనర్ కర్తవ్య దీక్ష


మార్కెట్లో చెత్తను తీయిస్తూ..


పూల దుకాణ వర్తకుడ్ని హెచ్చరిస్తూ..

కుప్పం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆదివారం తెలతెలవారుతుండగానే పట్టణ పరిశుభ్రతపై మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు ఫోకస్ పెట్టారు. మార్నింగ్ వాక్‌లో భాగంగా ఆర్టీసీ బస్టాండు ఎగ్జిట్ ద్వారం దుకాణాల ముందు పేరుకుపోయిన చెత్తను దగ్గరుండి తీయించేశారు. పూల అంగళ్ల వద్ద చెత్త పడి ఉండటాన్ని గమనించి దుకాణదారులను హెచ్చరించారు. ప్లాస్టిక్ కవర్ల వాడుతున్నారేమోనని తనిఖీ చేశారు. చికెన్ దుకాణాలకు సంబంధించి రోడ్డుమీద వ్యర్థాలను పరిశీలించారు. వెంటనే దుకాణదారులను హెచ్చరించారు. నేతాజీరోడ్డు ఫుట్‌పాత్ మీద కూరగాయల దుకాణాలు చెత్త ఉత్పత్తి కేంద్రాల్లా మారడాన్ని గుర్తించి వెంటనే చెత్తను తీయించారు. కృష్ణగిరి సర్కిల్‌లోని చేపల దుకాణాల పరిసరాలు దుర్గంధం కొడుతుంటే హెచ్చరించారు. రోడ్డుమీద చేపల వ్యర్థాలు వేయరాదంటూ మందలించారు. ఓపక్క మార్నింగ్ వాక్ చేస్తూ కర్తవ్యాన్ని నిర్వర్తించడాన్ని చూసి ప్రజలు చర్చించుకున్నారు. రోజూ తెల్లవారుజామున ఆయన పాటించే విధి ఇది.

ఆలయ పాలక వర్గం ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకారం చేసిన పాలక వర్గ సభ్యులు

వి.కోట, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): వి.కోటలొ దుర్గమ్మ ఆలయ పాలక వర్గం ఆదివారం కొలువుదీరింది. ఆలయ కమిటీ ధర్మకర్తగా రఘుపతినాయుడు, సహధర్మకర్తలుగా కృష్ణారెడ్డి, నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జగన్మోహన్‌రెడ్డి, సహాయ కార్యదర్శులుగా రమేష్‌బాబు, జనార్దన్, బాలాజీ కోశాధికారిగా తుకారం, కార్యవర్గ సభ్యులుగా రాజేష్‌బాబు, కార్తీక్‌రెడ్డి, మహేష్, శివకుమార్, ప్రతాప్‌రెడ్డి, శివరంజన్, తేజ, రాజాబాబు, చక్రీ, శ్రీనివాసులు, సతీష్, కృష్ణ, వెంకటేష్, మాదవ్, హరీష్, లోకేష్, భరత్, గణేష్‌లతో ఆలయ ప్రధానార్చకులు బాస్కర్‌శర్మ ప్రమాణం చేయించారు. ఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే దుర్గమ్మవారి పాల కలశాల కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించి, ఆలయ ప్రతిష్ఠ పెంచుతామని పాలక వర్గ సభ్యులు తెలిపారు. పట్టణ ప్రముఖులు ధర్మకర్తను ఘనంగా సన్మానించారు.

తుఫాన్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


రొంపిచెర్లలో మాట్లాడుతున్న చల్లాబాబు

రొంపిచెర్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుపాను పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లారామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన నివసంలో తుఫాన్ ప్రభావంపై అధికారులతో ఆరాతీశారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాన్నారు. వర్షం ప్రభావాన్ని ఎప్పటికప్పుడు తెలియజేస్తూ నష్ట నివారణకు సహకరించాలని కోరారు. రాష్ట్రకురబ కార్పొరేషన్ డైరెక్టరు ఉయ్యాలరమణ, హరిప్రసాద్‌నాయుడు, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు. **సోమల:** తుఫాన్ ప్రభావం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ట్రాన్స్‌కో ఏఈ మహేంద్రరెడ్డి కోరారు. విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని, విద్యుత్ సిబ్బంది క్షేత్రస్థాయిలో ఉండాలన్నారు. పశువులను విద్యుత్ స్తంభాలకు కట్టరాదన్నారు. ముందస్తు జాగ్రత్తగా పొలంలో నీరు నిల్వ లేకుండా చూడాలని వ్యవసాయాధికారి సుధాకర్ తెలిపారు. వరి పంటను ఒబ్బిడి చేసి మొలకెత్తకుండా ఉప్పు ద్రావణాన్ని ఒక లీటరు నీటిలో 50 గ్రాముల సాధారణ ఉప్పును కలిపి పిచికారీ చేయాలన్నారు. కాగా ఉదయం మంచు మరో వైపు చలిప్రభావం ఉంది. చిరుజల్లులు కురుస్తున్నాయి.

సేవే మానవత సంస్థ ధ్యేయం


సమావేశంలో మాట్లాడుతున్న మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు

పుంగనూరు రూరల్, నవంబరు30(ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు సేవ చేయడమే మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ధ్యేయమని ఆ సంస్థ అధ్యక్షుడు ఏసీ నారాయణరెడ్డి, కార్యదర్శి డాక్టర్ పూల ప్రభాకర్‌లు చెప్పారు. ఆదివారం స్థానిక విశ్రాంత ఉద్యోగ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంస్థ ఏర్పాటు చేసిన ఫ్రీజర్ బాక్స్‌లను రవాణా చేయడానికి వాహనాలు, నిర్వహణకు నిధులు అవసరమన్నారు. ఇందుకు దాతలు ముందుకురావాలని కోరారు. గత నెలలో పింక్‌బస్సు ద్వారా క్యాన్సర్ వ్యాధిపై నిర్వహించిన వైద్యశిబిరం ద్వారా అందించిన సేవలను వివరించారు. డిసెంబరులో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సంస్థ వైస్ చైర్మన్ నానబాల గణేశ్, నరసింహారెడ్డి, కె.వనిత, పి.చెంగారెడ్డి, హరినాథరెడ్డి, రామలింగారెడ్డి, రఘునాథరెడ్డి,, భక్తవత్సలరాజు, బీవీ.రమణారెడ్డి, వెంకటేశ్ పాల్గొన్నారు.

నిండు కుండలా మారిన చెరువులు

● తుఫాన్ తీవ్రతతో అప్రమత్తత అవసరం


మహారాజపురం చెరువుకు జలకళ-మొరవ పారుతున్న మంగళం చెరువు

విజయపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరువులు నిండుకుండలా మారాయి. మండలంలో సుమారు ఇరిగేషన్, పంచాయతీరాజ్ చెరువులు 38 వరకు ఉన్నాయి. వాటిలో మూడు చెరువులు మినహా అన్ని చెరువులు నిండి మొరవ పారుతున్నాయి. ఎక్కువ భాగం నిండిపోవడంతో దిత్వా తుఫాన్ తీవ్రత చెరువులపై పడుతుంది. రైతులు అప్రమత్తంగా ఉంటూ చెరువులను పరిశీలిస్తూ ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. మండలంలో పెద్ద చెరువు పన్నూరు, కట్ట బలహీనంగా ఉన్న కళియంబాకం చెరువు, వరద ఉధృతి ఎక్కువగా ఉన్న పాతార్కాడు చెరువులపై ప్రత్యేకదృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

నేడు చిత్తూరులో 'పీజీఆర్ఎస్'

చిత్తూరు అర్బన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): నగరపాలక కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని కమిషనర్ నరసింహ ప్రసాద్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తామని తెలిపారు. బాధిత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సేవలు


రచ్చబండ వద్ద పిచ్చిమొక్కలు తొలగిస్తున్న విద్యార్థులు

పలమనేరు, నవంబరు30 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ డిగ్రీక ళాశాలలోని ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఆదివారం గడ్డూరులో పారిశుధ్యచర్యలు చేపట్టారు. రచ్చబండ వద్ద పిచ్చిమొక్కలు తొలగించారు. మురుగునీటి కాలువల పక్కన పెరిగిన గడ్డి, పిచ్చిమొక్కలు తొలగించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి సామాజిక ఆర్థిక సర్వేను నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్.ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్.ఆర్.వెంకటేష్ బాబు, అధ్యాపకులు నాగరత్నంరెడ్డి, ఎ.సురేష్‌కుమార్, టి.జయరాం, చందు, దినేష్ కూడా పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సు ప్రభుత్వ ధ్యేయం

సోమల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రైతుల శ్రేయస్సు కోసం ప్రభుత్వం చిత్త శుద్ధితో పనిచేస్తుందని మాజీ వైస్ఎంపీపీ ఉమాపతి నాయుడు అన్నారు. ఆదివారం పెద్దఉప్పరపల్లె, అన్నెమ్మగారిపల్లెల్లో రైత న్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా కరపత్రాలను రైతులకు పంపిణీ చేశరు. కార్యక్రమంలో బాలాజీ నాయుడు, రెడ్డెప్ప నాయుడు, వేణుగోపాల్ నాయుడు, బంగారప్ప టీడీపీ నేతలు పాల్గొన్నారు.

బంగారమ్మ జాతరపై సమీక్ష


జాతరపై సమీక్షిస్తున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు ప్రసాద్

వెదురుకుప్పం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం గ్రామ దేవత బంగారమ్మ జాతర నిర్వహణపై ఆదివారం కార్యనిర్వాహకులు, గ్రామ పెద్దలు సమీక్ష నిర్వహించారు. డిసెంబరు 9న బంగారమ్మ జాతర చాటింపు, డిసెంబరు 16, 17 తేదీల్లో జాతర నిర్వహించాలని నిర్ణయించారు. వివిధ వేషధారణలతో జాతరకు పూర్వవైభవాన్ని తీసుకుని రావాలని సూచించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు కొప్పేటి ప్రసాద్, నిర్వాహకులు పాల్గొన్నారు.

ఐటీ హబ్‌గా మార్చడమే లక్ష్యం

● ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

చిత్తూరు సిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): చిత్తూరును ఐటీ హబ్‌గా మార్చడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. ఆదివారం స్థానిక లక్ష్మీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విద్యార్థులు, యువతతో ముఖాముఖి మాట్లాడారు. చిత్తూరులో విద్యావకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. అందుబాటులో ఉన్న నైపుణ్యాలు, ఇంకా ఎలాంటి సౌకర్యాలు అవసరం, యువత ఆకాంక్షలు ఏమిటి తదితర అంశాలపై చర్చించారు. యువత ఆకాంక్షలకు అనుగుణంగా చిత్తూరును అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి, సౌకర్యాల కల్పనకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నానని చెప్పారు. చెన్నై, బెంగళూరు వంటి మెట్రో మహానగరాల మధ్య ఉన్న చిత్తూరులో ఐటీ, పారిశ్రామిక పరంగా అనేక కంపెనీలు వస్తాయన్నారు. చిత్తూరును ఐటీ హబ్‌గా మార్చేందుకు సంప్రదింపులు జరుపుతున్నామన్నారు. జాబ్ మేళాలో టాటా, విప్రో వంటి 11 కంపెనీలు పాల్గొన్నాయి. 167 మంది నమోదు చేసుకోగా, ఇంటర్వ్యూల్లో 96 మంది ఎంపికయ్యారు. అనంతరం ఎంపికైనవారికి ఎమ్మెల్యే నియామక పత్రాలను అందజేశారు.

కార్తీక దీపోత్సవానికి ఆలయాల ముస్తాబు

గుడిపాల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 3న కార్తీక దీపోత్సవం సందర్భంగా మండలంలోని పలు ఆలయాలను ముస్తాబు చేస్తున్నారు. రఘునాథపురంలోని పాళ్యంకొండ ఆంజనేయస్వామి కొండలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజలు నిర్వహించి, గిరి ప్రదక్షిణ చేయనున్నారు. గొల్లపల్లె సమీపంలోని అత్తిగారిగుట్ట శివాలయం, 197రామాపురం జ్ఞానప్రసూనాంబ ఈశ్వరాలయం, కందగిరిలో వెలసిన సుబ్రహ్మణ్యంస్వామి ఆలయం, బసవాపల్లె కొండలో కార్తిక దీపాన్ని వెలిగించడానికి నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

శిథిలావస్థకు విద్యుత్ సేవాకేంద్ర భవనం


పలమనేరులోని విద్యుత్ సేవాకేంద్ర భవనం


పెచ్చులూడిపోయిన భవనం పైకప్పు

పలమనేరు, నవంబరు30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని విద్యుత్ సేవాకేంద్ర సముదాయ భవనం శిథిలావస్థకు చేరుకుంది. దీనిని 1999లో జన్మభూమి కార్యక్రమం కింద నిర్మించారు. ఇందులో ఏడీఈ, ఈఆర్ఓ కార్యాలయాలతోపాటు సేవాకేంద్రం ఉన్నాయి. పైఅంతస్తులో ఈఆర్ఓ కార్యాలయం, కింది వైపు ఏడీఈ కార్యాలయం ఉంది. భవన నిర్వహణ గురించి రెండు దశాబ్దాలుగా ఎవరూ పట్టించుకోలేదు. నాలుగేళ్లక్రితం పైకప్పుపై సోలార్ ప్యానల్స్ ఏర్పాటుచేసి సోలార్ విద్యుత్ వినియోగానికి శ్రీకారం చుట్టారు. అధికారుల పర్యవేక్షణా లోపంతో పాటు సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసే ప్రయివేటు వ్యక్తులు నరాసరి పైకప్పునకు డ్రిల్లింగ్ వేసి సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసి వెళ్లిపోయారు. దీంతో పైకప్పు బీటలు బారిపోయింది. పైకప్పు కింది భాగం ఏమాత్రం వర్షం వచ్చినా ఉరుస్తోంది. పైకప్పు కిందిభాగం పెచ్చులూడి పడిపోతోంది. దీంతో ఈఆర్ఓ కార్యాలయ సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తగిన మరమ్మతులు చేయాలని, లేదా కొత్త భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చిత్తూరును ఐటీ హబ్‌గా మారుస్తా

● ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్



నియామక పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

చిత్తూరు సిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): చిత్తూరును ఐటీ హబ్‌గా మార్చడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. ఆదివారం స్థానిక లక్ష్మీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విద్యార్థులు, యువతతో ముఖాముఖి మాట్లాడారు. చిత్తూరులో విద్యావకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. అందుబాటులో ఉన్న నైపుణ్యాలు, ఇంకా ఎలాంటి సౌకర్యాలు అవసరం, యువత ఆకాంక్షలు ఏమిటి తదితర అంశాలపై చర్చించారు. యువత ఆకాంక్షలకు అనుగుణంగా చిత్తూరును అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి, సౌకర్యాల కల్పనకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నానని చెప్పారు. చెన్నై, బెంగళూరు వంటి మెట్రో మహానగరాల మధ్య ఉన్న చిత్తూరులో ఐటీ, పారిశ్రామిక పరంగా అనేక కంపెనీలు వస్తాయన్నారు. చిత్తూరును ఐటీ హబ్‌గా మార్చేందుకు సంప్రదింపులు జరుపుతున్నామన్నారు. జాబ్ మేళాలో టాటా, విప్రో వంటి 11 కంపెనీలు పాల్గొన్నాయి. 167 మంది నమోదు చేసుకోగా, ఇంటర్వ్యూల్లో 96 మంది ఉద్యోగానికి ఎంపికయ్యారు. అనంతరం ఎంపికైనవారికి ఎమ్మెల్యే నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డీఎస్‌డీవో గుణశేఖర్, డీపీవో చైతన్య, టీడీపీ నగర అధ్యక్షుడు నరేష్, చిత్తూరు నియోజకవర్గ తెలుగుమహిళ అధ్యక్షురాలు లీలావతి, కార్పొరేటర్ శశి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంల బాధ్యతలు విలువైనవి



సమావేశంలో మాట్లాడుతున్న విశ్రాంత హెచ్‌ఎం సీతాపతినాయుడు

చిత్తూరు సెంట్రల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): విద్యా వ్యవస్థలో పాఠశాలను అన్ని రకాలుగా అభివృద్ధి చేయడంలో ప్రధానోపాధ్యాయుడి బాధ్యతలు ఎంతో విలువైనవని విశ్రాంత హెచ్‌ఎం సీతాపతినాయుడు అన్నారు. ఏపీ హెచ్‌ఎం అసోసియేషన్ ఏర్పడి 75 వసంతాలు పూర్తి చేసుకున్న క్రమంలో ఆదివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్లాటినం జూబ్లీ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న విశ్రాంత హెచ్‌ఎంలు సీతాపతి నాయుడు, చంద్రశేఖర్, బాలకృష్ణారెడ్డి, వీరరాఘవులు, త్యాగరాజు, భాస్కర్‌రావులు మాట్లాడుతూ పాఠశాలకు ఒక నాయకుడిగా హెచ్‌ఎం నిబద్ధతతో సేవలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందించేలా చూడటంతో పాటు వారి అభ్యున్నతికి ప్రతి టీచర్ కృషి చేసేలా చూడటం హెచ్‌ఎం ప్రధాన బాధ్యతన్నారు. తల్లిదండ్రుల సంఘాన్ని సమన్వయం చేసుకుంటూ దాతలతో పాఠశాల అభివృద్ధి సమీకరణ విలువైనదన్నారు. ఆ సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అరుణ్‌కుమార్, సురేష్ కుమార్ మాట్లాడుతూ డిసెంబరు నెలలో మంగళగిరిలో రాష్ట్రస్థాయిలో నిర్వహించే ప్లాటినం జూబ్లీ వేడుకలకు హెచ్‌ఎంలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. అనంతరం పూర్వ హెచ్‌ఎంలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పలువురు హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవను సద్వినియోగం చేసుకోవాలి



అన్నదాత సుఖీభవ కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

పాలసముద్రం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు పంపిణీ చేసిన అన్నదాత సుఖీభవ నిధులను సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు తాళ్లూరు శివానాయుడు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని వెంగళ్రాజుకుప్పం బీసీ కాలనీలో టీడీపీ నాయకులతో కలసి అన్నదాత సుఖీభవ కరపత్రాలను ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. అన్నదాత సుఖీభవ నిధులు విడుదల కాని రైతులు మండల వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి సాంబశివన్, పెనుమూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అరుళ్‌నాథన్, నాయకులు శేఖర్‌రాజు, బాలాజీనాయుడు, రోశినాయుడు, ఏసు, విక్రం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపక్కన మాంసం విక్రయిస్తే చర్యలు



మాంసం విక్రయదారులకు సూచనలిస్తున్న ఎంహెచ్‌వో లోకేష్

చిత్తూరు అర్బన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): నగరంలో రోడ్డు పక్కన జంతువధ, మాంసం విక్రయాలు జరిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ ప్రజారోగ్యశాఖ ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్ హెచ్చరించారు. మురకంబట్టు, కొంగారెడ్డిపల్లె, సంతపేట ప్రాంతాల్లోని రోడ్ల పక్కనే జంతువులను వధించి మాంసం విక్రయాలు చేయడమే కాకుండా వ్యర్థాలను పడేస్తున్నారని అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీనిపై ఆదివారం ఎంహెచ్‌వో లోకేష్, సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారు. రోడ్డు పక్కన జంతువులను వధించడం, వ్యర్థాలను అక్కడే పడేయడం వల్ల దుర్గంధంతో పాటు వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. మాంసం విక్రయాలను నిర్ణయించిన ప్రదేశంలోనే చేసుకోవాలని సూచించారు. మరోసారి స్థానికుల నుంచి ఫిర్యాదులు అందితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎయిడ్స్ బాధిత మృతులకు నివాళి

చిత్తూరు రూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం రాత్రి గాంధీ విగ్రహం ఎదుట జిల్లా లెప్రెసీ, ఎయిడ్స్ నివారణ శాఖ ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాధితో మృతి చెందిన వారికి కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. జిల్లా లెప్రెసీ, ఎయిడ్స్ నివారణ అధికారి వెంకటప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆ శాఖ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న వెంకటప్రసాద్ తదితరులు

అసంపూర్తిగా రైతు సేవా కేంద్రం



పల్లూరులో అసంపూర్తిగా ఉన్న రైతు సేవా కేంద్రం

గుడిపాల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లూరు గ్రామంలో రైతు సేవా కేంద్రం అసంపూర్తిగా నిలిచిపోయింది. ఐదు సంవత్సరాల క్రితం మంజూరైన రైతు సేవా కేంద్రాన్ని మోల్డింగ్ పనుల వరకు పూర్తిచేసి అసంపూర్తిగా నిలిపివేశారు. లక్షలాది రూపాయలు వెచ్చించి ఇలా వృథాగా వదిలివేయడం వలన రైతులు, అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న భవనాన్ని పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇరగమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఇరగమ్మ అమ్మవారు

శ్రీరంగరాజపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎస్‌ఆర్‌పురం మండలం పిళ్లారికుప్పం గ్రామ పంచాయతీ మూలూరు గ్రామంలో కొలువైన ఇరగమ్మ ఆలయ మూడో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకపూలతో అలంకరించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. ఆలయ చైర్మన్ శ్రీనివాసులు రెడ్డి, గ్రామస్తులు దాము తదితరులు పాల్గొన్నారు.

మన్‌కీ బాత్ వీక్షించిన బీజేపీ నాయకులు

వెదురుకుప్పం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వెదురుకుప్పం మండలం తెల్లగుండ్లపల్లిలో ఆదివారం టీవీలో బీజేపీ నాయకులు వీక్షించారు. ప్రధాని నరేంద్రమోదీ దేశాన్ని ఉద్దేశించి ప్రసంగించిన కార్యక్రమాన్ని వీక్షించారు. వీరిలో ఎస్సీ మోర్చా జిల్లా ప్రధానకార్యదర్శి పాముల శేషాద్రికుమార్, నాయకులు భాస్కర్ తదితరులు ఉన్నారు.

బంగారమ్మ జాతరపై సమీక్ష



జాతరపై సమీక్షిస్తున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు ప్రసాద్

వెదురుకుప్పం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం గ్రామ దేవత బంగారమ్మ జాతర నిర్వహణపై ఆదివారం కార్యనిర్వాహకులు, గ్రామ పెద్దలు సమీక్ష నిర్వహించారు. డిసెంబరు 9న బంగారమ్మ జాతర చాటింపు, డిసెంబరు 16, 17 తేదీల్లో జాతర నిర్వహించాలని నిర్ణయించారు. వివిధ వేషధారణలతో జాతరకు పూర్వవైభవాన్ని తీసుకుని రావాలని సూచించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు కొప్పేటి ప్రసాద్, నిర్వాహకులు పాల్గొన్నారు.

దిత్వా తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలి



స్థానికులకు సూచనలిస్తున్న సీఐ నెట్టికంఠయ్య

చిత్తూరు అర్బన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రెండో పట్టణ సీఐ నెట్టికంఠయ్య సూచించారు. ఆదివారం తుఫాన్ వల్ల ఇబ్బందులుపడే బీఎంఆర్‌గార్డెన్, నీవానది ప్రాంతాలను పరిశీలించారు. స్థానికులతో కలిసి మాట్లాడారు. తుఫాన్ ప్రభావం అధికమైతే పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అవసరమైనప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. వర్షం కురుస్తున్నప్పుడు బయటికి రాకూడదన్నారు. ఒకవేళ వర్షం కురిసి ప్రవాహం అధికమైతే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన్నారు.

● నింద్ర(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తహసీల్దార్ ఈశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, శిథిలావస్థ భవనాల్లో నివాసం ఉన్న ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలన్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.

ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు



చింతలపట్టెడలో పర్యటిస్తున్న అధికారులు

నగరి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ ప్రభావంతో వర్షం ఎక్కువగా కురిసే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని చింతలపట్టెడ లింగీసుగుంట ప్రాంతంలో ఆర్డీవో అనుపమ, తహసీల్దార్ రవికుమార్, మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. రాత్రికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉండాలని సూచించారు.

5 నుంచి 11 వరకు ప్రవచనాలు

చిత్తూరు కల్చరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక నగరపాలక నాగయ్య కళాక్షేత్రంలో డిసెంబరు 5 నుంచి 11వ తేది వరకు ప్రతి రోజు సాయంత్రం 6నుంచి 9 గంటల వరకు ప్రముఖులచే ఆధ్యాత్మిక ప్రవచనాల కార్యక్రమాన్ని చిత్తూరు నారాయణీ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు సంస్థ ఆర్గనైజర్ చిరంజీవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 5, 6, 7 తేదీల్లో ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు శ్రీకాళహస్తీశ్వరశతకం, 8,9,10,11 తేదీల్లో రాధా మనోహర్‌దాస్‌చే భజగోవిందంపై ప్రవచనాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

కార్తిక దీపానికి ముస్తాబవుతున్న ఆలయాలు

గుడిపాల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 3న కార్తీక దీపోత్సవం సందర్భంగా మండలంలోని పలు ఆలయాలను ముస్తాబు చేస్తున్నారు. రఘునాథపురంలోని పాళ్యంకొండ ఆంజనేయస్వామి కొండలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజలు నిర్వహించి, గిరి ప్రదక్షిణ చేయనున్నారు. గొల్లపల్లె సమీపంలోని అత్తిగారిగుట్ట శివాలయం, 197రామాపురం జ్ఞానప్రసూనాంబ ఈశ్వరాలయం, కందగిరిలో వెలసిన సుబ్రహ్మణ్యంస్వామి ఆలయం, బసవాపల్లె కొండలో కార్తిక దీపాన్ని వెలిగించడానికి నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

జలదిగ్బంధంలో ఇందిరానగర్ కాలనీ

● పాములు, విషపురుగులతో స్థానికుల సహవాసం



ఇళ్ల పక్కనే నిల్వ వున్న వర్షపు నీరు, కాలనీ రోడ్డుపై ఏర్పడిన పెద్దకుంట

చిత్తూరు రూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక సంతపేటలోని కరుమారమ్మ ఆలయం ఎదురుగా ఉన్న ఇందిరానగర్ కాలనీ జలదిగ్బంధంలోనే వుంది. నెల రోజులక్రితం కురిసిన వర్షాలకు చెరువులు నిండి సంతపేటలోని ఇందిరానగర్ వైపుకు ప్రవహించడంతో అక్కడున్న గృహాలన్నీ నీటమునిగాయి. నేటికీ అక్కడి ప్రజలు నీటిలోనే జీవిస్తున్నారు. కాలనీకి వెళ్లి రావాలంటే కుంటలాంటి రోడ్డును దాటి వెళ్లాల్సిందే. రెండు రోజుల క్రితం నల్లనాగు పాము ఇంట్లోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తుంటే గమనించిన ఓ మహిళ గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు వచ్చి చంపేయడంతో ఊపిరిపీల్చుకున్నారంతా. దీంతో కాలనీ వాసులు భయాందోళన చెందుతున్నారు. దీనిపై నగరపాలక అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని వారు ఆవేదన చెందుతున్నారు.

● నెల రోజులుగా నీళ్లల్లోనే



మా కాలనీకి వరద వచ్చి నెలరోజులు అవుతోంది. అప్పటి నుంచి ఇప్పటి వరకూ నీళ్లల్లోనే జీవిస్తున్నాం. ఉన్న మట్టిరోడ్డు వరదనీటి కోతకు గురికావడంతో ఇళ్ల ముందే నీరు నిల్చి రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి మా సమస్యను పరిష్కరించాలి.

- సిరాజ్

● భయంతో జీవిస్తున్నాం



చీకటి పడితే వీధిలోకి రావాలంటే భయమేస్తోంది. విషపూరిత పాములు ఇళ్ల చుట్టూ కనిపిస్తున్నాయి. చాలా కాలంగా నీరు నిలిచి ఉండటంతో దుర్వాసన, దోమలతో ఇబ్బందులు పడుతున్నాం. మళ్లీ తుఫాను అంటున్నారు. ఏమవుతుందోనని ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని బతుకుతున్నాం. ఇప్పటికైనా కలెక్టర్ పట్టించుకొని మా సమస్యను పరిష్కరించాలి.

- సుబ్రమణ్యం

నిండుకుండల్లా చెరువులు

● కలుజులు పారుతున్న వైనం



కలుజు పారుతున్న బీరప్ప చెరువు, నిండిన పిళ్లారి చెరువు

ఐరాల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని పెద్ద చెరువులన్నీ నిండిపోయి నిండుకుండల్లా ఉన్నాయి. ఐరాల మండలంలో మొత్తం 143 చిన్న, పెద్ద చెరువులున్నాయి. ఇందులో 14 పెద్ద చెరువులు నిండి కలుజులు పారితే మండల వ్యాప్తంగా సుమారు రెండు సంవత్సరాల వరకు తాగు, సాగునీటికి ఎలాంటి ఇబ్బందులుండవు. పిళ్లారిచెరువు, బొమ్మసముద్రంచెరువు, నేరేడుచెరువు, చెన్నరాయునిచెరువు, వీరరాఘవులచెరువు, రెడ్డిచెరువు, బీరప్పచెరువు, కోనగుంటచెరువు, పల్లెపాటి దిగువచెంగన్న చెరువు, వేల్‌రెడ్డిచెరువు, కొత్తచెరువు, రెడ్డిచెరువు, చుక్కావారిపల్లె చెరువులు పూర్తిగా నిండిపోయాయి. దీంతో మండల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వచ్చే ఏడాది అధికారులు సప్లై చానళ్లను బాగు చేస్తే వర్షాలు కురిసిన వెంటనే చెరువులు త్వరితగతిన నిండుతాయని ఆయకట్టు దారులు అభిప్రాయపడుతున్నారు.

తారురోడ్డుపై గ్రానైట్ వ్యర్థనీరు

● పేరుకుపోయిన ఇసుకమేటతో ప్రజలకు ఇక్కట్లు

గంగాధరనెల్లూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తారురోడ్డుపై గ్రానైట్ వేస్ట్‌నీటితో పాటు ఇసుక మేటతో స్థానిక ప్రజలతోపాటు వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. గంగాధర నెల్లూరు మండలం పెద్దకాల్వ పంచాయతీ సుందరరాజుపురం వద్ద పాల డెయిరీ పక్కన గల గ్రానైట్‌ఫ్యాక్టరీల్లో గ్రానైట్ దిమ్మెలు కటింగ్ చేసేటపుడు వెలువడే తెల్లటి వ్యర్థనీటితో పాటు డెయిరీలో నుంచి వెలువడే వ్యర్థనీటిని యథేచ్ఛగా ఎన్‌టీఆర్ కాలనీ (చిత్తూరు - పుత్తూరు రహదారి) వరకు నడిరోడ్డుపై వదిలేస్తున్నారు. ఈ వ్యర్థనీరు దుర్వాసన వస్తుండటంతో ముక్కుపుటలు అదిరిపోతున్నాయి. ఇటీవల వర్షాలకు తారురోడ్డుపై ఇసుక మేట పేరుకుపోవడంతో ప్రయాణాలు సాగించే వాహనదారులు నానా తంటాలు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులైతే అదుపుతప్పి ప్రమాదాలబారినపడి గాయాలకుగురై ఆసుపత్రుల పాలవుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రానైట్ ఫ్యాక్టరీ, డెయిరీ నుంచి యథేచ్ఛగా వ్యర్థనీటిని నడిరోడ్డుపైకి వదలనీయకుండా, రోడ్డుపక్కన పేరుకుపోయిన ఇసుకమేటను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఎన్‌టీఆర్ కాలనీ - పాలడెయిరీకి మధ్యలో తారురోడ్డుపక్కన గ్రానైట్ వ్యర్థనీరు, ఠాణా నుంచి చిత్తూరు వెళ్లే దారిలో రోడ్డుపక్కన పేరుకుపోయిన ఇసుక

నిరుపేదల ఆపన్నహస్తం సీఎం సహాయనిధి

● ఎమ్మెల్యే భానుప్రకాష్



లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడి సత్వర చికిత్స కోసం ప్రైవేటు వైద్యశాలలో చేరిన నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఓ వరం లాంటిదని ఎమ్మెల్యే భానుప్రకాష్ అన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను ఆదివారం నగరి మున్సిపల్ పరిధిలోని టీడీపీ కార్యాలయంలో లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. నగరి మున్సిపాలిటీకి చెందిన కసింపేట నివాసి చామంతికి రూ.37,205లు, పుదుపేటకు చెందిన బాలమురుగన్‌కు రూ.95,020లు, సీఏ దండపాలకు రూ.15,000, నాగరాణికి రూ.41,509లు, చింతలపట్టెడకు చెందిన ఎం.పి.సంగీతకు రూ.95,269లు, ఎంజే లక్ష్మికి రూ.10వేలు, ఏకాంబరకుప్పంకు చెందిన షాలినీకి రూ.63,918లు, ప్రకాశం రోడ్డుకు చెందిన మంజులకు రూ.37,525లు చెక్కులను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో నగరి పట్టణ టీడీపీ అధ్యక్షుడు గుణశేఖర్, కార్యదర్శి శ్రీనివాస్, నేతలు బాలాజీ, వడివేలు, శ్రీనివాసరాజు, మదన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు బహుమతుల ప్రదానం



ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు బహుమతులు అందజేస్తున్న బ్రహ్మానందం

నగరి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎంఎస్‌ఎంఎస్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల 7వ రోజు ప్రత్యేక శిబిరాన్ని ఎన్‌ఎస్‌ఎస్ అధికారి బ్రహ్మానందం ఆధ్వర్యంలో మున్సిపల్ పరిధి ఏకాంబరకుప్పం దళితవాడలో ఆదివారం నిర్వహించారు. ఏడు రోజులపాటు నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని మొక్కలు నాటి పూర్తి చేశారు. ఉత్తమ వలంటీర్లకు కళాశాల ప్రిన్సిపాల్ మంజుల ఆధ్వర్యంలో బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఏకాంబరకుప్పం పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాపయ్య, ఉపాధ్యాయులు పృథ్వీ, కళాశాల అధ్యాపకులు ఉమావాణి, హిమబిందు పాల్గొన్నారు.

నేడు నగరపాలక కార్యాలయంలో 'పీజీఆర్‌ఎస్'

చిత్తూరు అర్బన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): నగరపాలక కార్యాలయంలో సోమవారం పీజీఆర్‌ఎస్ కార్యక్రమం జరుగుతుందని కమిషనర్ నరసింహ ప్రసాద్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తామని తెలిపారు. బాధిత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఐరాలలో ముసురు వాన

ఐరాల(కాణిపాకం), నవంబరు 30(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ ప్రభావంతో ఆదివారం ఐరాలలో ముసురు వానతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. ఉదయం నుంచి వాతావరణం పూర్తిగా మారిపోయింది. మేఘాలు కమ్ముకుని చలి తీవ్రంగా ఉంది. అప్పుడప్పుడు చిన్నగా వర్షం కురుస్తుండటంతో రోడ్డు పక్కన చిరు వ్యాపారులు అవస్థలు పడ్డారు. బస్టాండ్ లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. వర్షం పెద్దగా కురవకపోయినా చలి తీవ్రంగా ఉండటంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు.

భక్తి ప్రపత్తులతో వీరభద్రస్వామికి పూజలు



ఓబనపల్లె వీరభద్ర ఆలయంలో ఎమ్మెల్యే గురజాల

చిత్తూరు కల్చరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓబనపల్లె కాలనీలో వెలసిన వీరభద్ర స్వామిని ఆదివారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ తన అనుచరులతో కలిసి దర్శించుకున్నారు. సిబ్బంది ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికి పూజలకు ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగరంలోని రజక కులస్థులకు ఆధునిక సాంకేతికతో కూడిన యంత్రాలతో మోడరన్ దోబీఘాట్‌లు ఏర్పాటుచేస్తానన్నారు. అనంతరం ఆయనకు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ, స్థానిక నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ విప్ పర్యటన

పాలసముద్రం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం ప్రభుత్వ విప్ థామస్ పర్యటించనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు తాళ్లూరు శివానాయుడు, ప్రధాన కార్యదర్శి సాంబశివన్ తెలిపారు. పాలసముద్రం కాలనీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేసి, అక్కడే మండలస్థాయి అధికారులతో పీజీఆర్‌ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం పాలసముద్రం కాలనీ అయ్యప్పరాజుకండ్రిగ, ఎంపీడీవో కార్యాలయం ఎదుట నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు, కూటమి ప్రభుత్వ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

లారీ ఢీకొని మోటారు సైక్లిస్టు మృతి

పలమనేరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పలమనేరు-పుంగనూరు రహదారిలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డుప్రమాదంలో అంజి అనే వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. ముత్తుకూరునుంచి మోటరుసైకిల్‌పై వస్తున్న అంజిని ముత్తుకూరు క్రాస్‌వద్ద లారీ ఢీకొంది. తలకు తీవ్రగాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అంజిమృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించి, పెద్దపంజాణి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిండిన చెరువులు

● తుఫాన్ తీవ్రతతో అప్రమత్తత అవసరం



నిండు కుండలా ఉన్న మహారాజపురం చెరువు



మొరవ పారుతున్న మంగళం చెరువు

విజయపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరువులు నిండు కుండలా మారాయి. మండలంలో సుమారు ఇరిగేషన్, పంచాయతీరాజ్ చెరువులు 38 వరకు ఉన్నాయి. వాటిలో మూడు చెరువులు మినహా అన్ని చెరువులు నిండి మొరవ పారుతున్నాయి. ఎక్కువ భాగం నిండిపోవడంతో దిత్వా తుఫాన్ తీవ్రత చెరువులపై పడుతుంది. రైతులు అప్రమత్తంగా ఉంటూ చెరువులను పరిశీలిస్తూ ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. మండలంలో పెద్ద చెరువు పన్నూరు, కట్ట బలహీనంగా ఉన్న కళియంబాకం చెరువు, వరద ఉధృతి ఎక్కువగా ఉన్న పాతార్కాడు చెరువులపై ప్రత్యేకదృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.